



# భయం

- టి.యస్.ఆనంద్



మూడు రోజులుగా కుండపోత వర్షం... వీధుల్లో జనసంచారం పలుచగా కానవస్తుంది. డబ్బున్న మహారాజులు ఖరీదైన ఇళ్లల్లో కేరింతలు కొడుతూ, జరిగితే జ్వరమంత సుఖం లేదన్నట్లు కులాసాగా గడుపుతున్నారు.

పూరిపాకల కంతల్లో నుంచి వస్తున్న వర్షపుదారను అడ్డుకునేందుకు బొచ్చెలు, మట్టి దాకాలు అడ్డం పెడుతున్నారు గుడిసెవాసులు.

కాలే కడుపుకు ఇంత గంజి కాసుకొని తాగాలన్నా పొయ్యిలు నానిపోయి తడి పుల్లలు కాలక దిగాలుగా కూర్చున్నారు. ఏమి చెయ్యాలో తోచక, బురదలో, చెమ్మలో మూలమూలగా జరుక్కుంటూ బిక్కుమనే జీవితాలు ఈ పాడు వర్షం ఇంకెన్నాళ్లో? అని తిట్టుకుంటున్నారు.

ఊరికి దూరంగా ఒక పాడుపడిన దేవాలయంలో దిక్కుతోచని యాచక కుటుంబం మూడు రోజులుగా కడుపు మంటచల్లార్చుకునే దారిలేక విలవిల్లాడు తోంది.

పెరిగిన గడ్డం తైలసంస్కారం లేని జుట్టు మాసిపోయిన పొడుగాటి లాల్చి, చిరుగులుపడి ముడులు పడిన అంగవ స్త్రంతో సుమారు ఏభై సంవత్సరాల భిక్ష గాడు బాధగా రోదిస్తున్నాడు. అతని రోదన పట్టించుకునే వారెవ్వరూ లేకపో యినా, తన కోసం బ్రతుకుతున్న భార్య తనకు దక్కాలనే ఆవేదన అతనిలో కొట్టు మిట్టాడుతోంది. దేవాలయంలో ఒక మూలగా నేలపై పడిమూలుగుతోంది అతని భార్య. ఒళ్ళు కాలిపోతోంది. గుక్కెడు టీ నీళ్లు తెచ్చి పెట్టేందుకు చిల్లి గవ్వలేని అశక్తుడిగా అతడు మిగిలాడు. తల్లి ఎదురుగా ఏమీ పాలుపోని ఇద్దరు పిల్లలు తండ్రి ముఖంలోనికి అర్థంకాని చూపులు చూస్తున్నారు.

వర్షం కాస్త తెరిపి ఇచ్చింది. కుండ పోత వర్షం తుంపరులుగా పడి తదుపరి తుంపరలు మాయమయ్యాయి.

"జానకీ....! చిన్నగా పిల్చాడు భిక్ష గాడు.

సమాధానంగా మూలిగింది ఆమె.

'వర్షం తెరిపిచ్చింది... ఊళ్లోకిపోయి ఏ దాతనైనా అడిగి తినడానికి ఏమైనా తెస్తాను. పిల్లలు జాగరత' చెప్పాడు.

సరేనని చిన్నగా తలాడించింది జానకి. జోలె చంకన వేసుకొని ఆ జోలెలో సత్తుకేరేచే పెట్టి ఊత కర్ర చేత పట్టి భిక్షగాడు పక్కనున్న గ్రామం బయలు దేరాడు. మిట్ట మధ్యాహ్నం వేళ. గత మూడు రోజులు మబ్బు ఏమ యిందో తెలీని ఎండ. మూడు రోజులూ మబ్బులో బందీ అయినందున కాబోలు తనకసినంత చూపుతున్నాడు. సూరీడు అది ఎండకాదు నిప్పులవేడి. ముఖం ఎదుట రాజుతున్న కుంపటి పెట్టిన ట్లుంది. వీధులు నిర్మానుష్యంగా ఉన్నాయి. తలుపులన్నీ మూసుకుపోయి కర్ఫ్యూ వాతావరణం కనిపిస్తోంది. ప్రతి ఇంటి తలుపుపైనా, గోడమీద ఎర్రని అర చేతి ముద్రలు ఉన్నాయి. ఎప్పుడో




చూసిన ఆలీబాబా నలభై దొంగలు సినిమా జ్ఞాపకం వచ్చింది. ప్రతీ ఇంటి ముందు ఈ అరచేయి గుర్తులేమిటో అర్థంకాలేదు. తను తలచిన ఇంటి ముందు ఆగి, "భిక్షంతల్లీ" అడుగుమ డుగు ఉన్న మెతుకుల్లో కాస్త గంజి కలిపి యియ్యితల్లీ" హృదయ విదారకంగా అడుగుతున్నాడు. ఏ ఇంటి ముందూ సమాధానం రాలేదు.

భిక్షగాడి కడుపులో ఆకలి దహిస్తోంది. కళ్లుతిరుగుతున్నాయి. నడిచే ఓపికా, అరచే శక్తి నశించసాగాయి. కర్ర ఊత పట్టుకొని లేని శక్తిని అతికష్టంగా కూడదీ సుకొని నడుస్తున్నాడు. ఆ కళ్ళముందు జ్వర తీవ్రతతో బాధపడుతున్న భార్య, తను తెచ్చిన కబళంతినేందుకు ఆశతో ఉన్న పిల్లలు తప్ప ఎవరూ కనిపించడం లేదు. అతని హృదయం దహించుకుపో తోంది. ఇప్పుడా గ్రామం గ్రామంగా కని పించే స్థితిలో లేదు. ఎడారిగా ఉంది. నడచినడచి ఒక రావిచెట్టు నీడన కూలబ డ్డాడు. వస్తున్న ఆయాసాన్ని అదుపులో పెట్టుకొని చుట్టూ కలియచూసాడు. తను చేయవలసిందేమిటో అర్థంకాక ఆ గ్రామానికి దిష్టిబొమ్మలా తాను మిగిలి పోయినట్లుగా భావించాడా బిక్షగాడు.

ఎందుకైనా మంచిది మరికొంచెం దూరం నడుద్దాం ఏ కన్న తల్లికైనా, ఏ దాతకైనా దయకలగదా? ఇంత అన్నం పెట్టకపోతాడా. కూసిన్ని చిల్లరి డబ్బులు దక్కకపోతాయా? ఆశల లెక్కలు భిక్ష గాడి మనసులో మొలిచాయి. దాంతో లేని శక్తిని కూడబెట్టుకొని లేచాడు. జోలె సవరించుకుని రావిచెట్టు నీడ నుంచి మళ్ళి ఎండలోకి ప్రయాణం సాగిం చాడు.

అక్కడ ఇద్దరు పిల్లలు ఆడుకుంటు న్నారు. ఒకట్లు, రెండ్లు, మూడులు, నాలుగులు, అయిదులు కొండలు, కొండ వతల్లు అంటూ తొక్కుడు బిల్ల ఆటలా డుతూ ముచ్చటగా ఉన్న ఆ పిల్లల దగ్గ రకు వెళ్తున్నాడు భిక్షగాడు.

అంతే కెవ్వుమని అరచి బెదరిపో యారు పిల్లలు. ఎదురుగా ఉన్న ఇంటి తలుపులు బాదుతూ భయం భయంగా అరిచారు పిల్లలు. ఆ ఇంటి తలుపులు తెరచుకున్నాయి. గుమ్మంలో నిలు చున్న ఆ ఇంటి పెద్దలను కౌగలించుకొని బావురుమన్నారు చిన్నారులు. జరిగిందే మిటో ఆ ఇంటి వారు అర్థం చేసుకు న్నారు. వచ్చేసింది దెయ్యం! అదిగో రండి రండి!' ఆ ఇంట్లో వాళ్ళంతా రండి అంటూ గట్టిగా కేకలు వేయసాగారు. నెమ్మదిగా వాడలోని ఇళ్ళ తలుపులు తెరచుకోసాగాయి. వాళ్ళ మధ్య ఏకా కిగా నిలబడ్డ భిక్షగాడు అర్థంకాక పిచ్చి చూపులు చూస్తున్నాడు.

మాసిన గెడ్డం....

చిరిగిన దుస్తులు...

ఒరికిపోతున్నట్లు తలాడిస్తున్న భిక్ష గాడు జోలెలో సత్తు క్యారేజీ తీసి, మాట రాక, సౌంజ్ఞతో భిక్షం అడుగుతున్నాడు కానీ...

ఆ గ్రామీణుల మనస్సుల్లో అందరికీ ఒకే సందేహం....

మిట్టమధ్యాహ్నం. అర్థరాత్రపుడు ప్రతి ఇంటిముందూ ఆగి, తలుపు తడు తున్న దెయ్యం.

పిల్లల్ని, పడుచువాళ్ళని తీసుకు పోయి, బలి తీసుకుంటున్న పిశాచి.

రోగాలు రప్పించి, వివిధ రకాలుగా మృత్యువును ప్రసాదిస్తున్న మృత్యు సంకేతం. గ్రామస్థుల కళ్ళలో ఆందోళన. అవాక్కయి నిలబడి చూస్తున్నారంతా.

ఆర్థంకాని భిక్షగాడు కడుపుని చూపుతూ సంజ్ఞచేస్తున్నాడు. చిన్నగా కన్నీరు కారుస్తూ సత్తుక్యారేజీ గ్రామీణు లకు చూపి అందులో భిక్ష చేయమని సంజ్ఞ చేస్తున్నాడు.

ప్రతి ఇంటి ముందు రాత్రివేళలో వచ్చి పలుకరించి వెళ్తున్న దయ్యం ఇదేనన్న మాట ! ఆంజనేయస్వామి సింధూరం అరచేయిలో కలిపి, గోడకు, తలుపులకు కొడితే దయ్యం బారి తప్పుతుందని తల చిన తమకు ప్రత్యక్షంగా ఈ దయ్యం కన బడ్డం ఏమిటి?

గ్రామ పెద్దలు చెప్పింది నిజమే ! సాధువు రూపంలోనూ, పిచ్చివాడిగా, భిక్షగాడిగా, తెల్లని వస్త్రాలు ధరించిన స్త్రీగా, ఇలా రకరకాలుగా మిట్టమధ్యా హ్నపువేళ, అర్ధరాత్రి సమయాన ఈ ఊరికి దయ్యం వస్తుందని చెప్పారు. ఆ సమయంలో ఎవరూ తలుపులు తీసి ఉంచరాదని, బయట తిరగరాదని చెప్పారు. ఇప్పుడేమో అందరం తలు పులు తీసేశాం. ఇప్పుడేమిటి చెయ్యా డం? అందరిలో అదే ప్రశ్న. అదే భయం. అదే నిర్ణయం.

ఒకరికొకరు తమాయించుకున్నారు.

ఒక నిర్ణయానికి వచ్చారు.

ఎలాగైనా దయ్యాన్ని తరమాలి.

ఈ ఊరినుంచి గెంటించాలి.


తమ పిల్లల్ని దాని బారినుంచి కాపా డుకోవాలి.

ఎవరి పనులు వారు పగటిపూట సరిపె ట్టుకోవాలి.

అంతే ! కర్రలు, కత్తిపీటలు, రోకళ్ళు, రోళ్ళు... ఎవరిచేతికి చిక్కినవి వాళ్ళు పట్టుకున్నారు. నిశ్శబ్దం భంగమయింది.

పెద్దగా కేకలు వేశారు.

తేరుకున్న భిక్షగాడు పడుతూ, లేస్తూ ఆయాసంతో రొప్పుతూ పరుగెడుతు న్నాడు. వెనుకనుంచి రాళ్ళు, బడితలు విసురుగా వచ్చి భిక్షగాడ్ని తాకాయి. భిక్ష గాడ్ని తరుముతున్నాయి. అంతలో విసు



రుగా వచ్చిన రాయి భిక్షగాడి నుదుటికి తగిలింది. గాయంతో రక్తసిక్తమైంది నుదురు.

కళ్లు తిరిగి పడిపోయాడు. రక్తపుధార మాసినగడ్డంపై నుంచి జారి దుస్తులపై పడింది. భయంకరంగా మారింది భిక్షగాడి ఆకారం. "కొట్టండి ! చంపండి !... బ్రతక్కూడదు. ఈ దయ్యం ఇక ఈ ఊరికి రాకూడదు". ప్రజలందరిది ఒకటే నిర్ణయం.

సత్తు క్యారేజీ ముదతలుగా మారి ముద్దగా మారి ఎర్రటి నెత్తురులో తడిసింది. ఊరికి పట్టిన దయ్యం పీడ వదిలిందని ఎవరికి వారు అక్కడ్నుంచి కదిలారు.

ఆ రాత్రి గ్రామీణులు సమావేశమై ఈ విషయం ఎవరికి చెప్పరాదని, ఎక్కడా పొక్కరాదని నిర్ణయించుకున్నారు. ఒక దయ్యం అర్ధరాత్రప్పుడు మిట్టమధ్యాహ్నం వేళ ప్రతి ఇంటి తలుపుతట్టి, తలుపు తీసిన కుటుంబంలో పిల్లలను, కన్నెలను ఎత్తుకుపోతుందనే వదంతి ఆ గ్రామీణులు నమ్మారు. నివారణకు అరచేతికి సింధూరం రాసుకొని ఆంజనేయ స్వామిని తలచి ప్రతి గోడకు, తలుపులకు కొట్టారు. వివిధ వేషాలతో ఆ దయ్యం వస్తుందనే నమ్మకంతో భయపడుతున్న ఆ గ్రామ జనంకి భయం తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు. రాత్రి గడచి భళ్ళున తెల్లారింది.

ఆ గ్రామ పొలిమేరల్లో తుప్పల్లో వృద్ధుని శవం. పోలీసులకు ఆ వార్త అందింది. శవాన్ని చూశారు. ఆ శవం ఎవరిదో అర్థం కాలేదు. ఆధారాలు లేవు. గ్రామీణులకు కబురు చేశారు. ఎవరికి వారే తమకు ఏమీ తెలియదని చెప్పారు. నిజం నిద్రపోయింది.

మరునాడు దినపత్రికల్లో గుర్తు తెలియని వృద్ధుని శవం గురించిన వార్తలు వెలువడ్డాయి.

ఆ వార్త చూసిన గ్రామీణులు అవాక్కయిపోయారు. దెయ్యమయితే మాయమయిందే కదా ! ఇంతకీ మనం చంపింది మనిషినా? దయ్యాన్నా? అనే అనుమానం ప్రారంభమయింది. తిరిగి భయం వారిలో ప్రవేశించింది.

భిక్షగాడికోసం భార్యాబిడ్డలు పాడుపడిన దేవాలయంలో ఎదురుచూస్తున్నారు. భిక్షగాడి భార్య రోదిస్తోంది తన యజమాని రాలేదని, అర్థంకాని పిల్లలు భయంగా తల్లివైపు చూస్తున్నారు. భయానికి బలయిన భిక్షగాడి శవం శవపరీక్షకు తరలింది. ●

# ఇతరుల మనోభావాలకు ప్రతిస్పందన



ఇతరుల మానసిక ఉద్రేకాలకు ప్రతిస్పందించడం మానవ సహజం. దీన్నే ఇంగ్లీషులో ఎంపతి అంటారు. ఇంకో విదంగా చెప్పాలంటే ఇతర సుఖదుఖాఃలను మనవిగా భావించి, ప్రతి చర్య చూపడం. అయితే దీనికి అవధులు లేకపోలేదు. పైగా తప్పనిసరిగా ప్రతి సన్నివేశంలోను మనం ప్రతిస్పందన చూపుతామనే గ్యారంటీ లేదు. చాలామటుకు ఇది ఆయా వ్యక్తుల స్వభావం మీద, వారు పెరిగిన పరిస్థితుల మీద ఆధారపడుతుంది. ఈ లక్షణం బాల్యం నుంచే క్రమంగా పరిణామం చెందుతుందని, న్యూయార్క్ యూనివర్సిటీకి చెందిన డా. మార్టిన్ హాఫ్‌మన్ అనే శాస్త్రవేత్త మానవ జీవితంలో ఈ లక్షణం నాలుగు దశలలో అభివృద్ధి చెందుతుందని ప్రతిపాదించాడు. శిశువులలో ఎంపతిని గురించి అధ్యయనం చేసిన పరిశోధకులు అది నెమ్మదిగా ఏఏ దశలలో వికసిస్తుందో తెలుసుకుని, ఎటువంటి పరిస్థితులు ఒక మనిషి సౌమ్యమైన, దయగల మనిషిగా రూపొందడానికి దోహదం చేస్తాయి, ఏ పరిస్థితులు ఒక వ్యక్తి విముఖత గల లేదా ప్రతికూల స్వభావం గల వాడినిగా చేస్తాయి అనే విషయం చర్చించారు.

యౌవన దశ ప్రారంభం వరకు ఎంపతీ అనే లక్షణం పూర్తిగా అభివృద్ధి చెందదని నిర్ధారించారు. మొదటి దశలో శిశువుకు తనకు, ఇతరులకు మధ్య వేర్పాటు భావం ఉండదు. ఇంకొకరి దుస్థితిని చూసి ఏదో సాధారణ దుస్థితిని వ్యక్తం చేయడానికి మాత్రమే ఆ దశలో ఎంపతి పరిమితమవుతుంది. ఉదాహరణకి 9 నెలల వయసు శిశువు ఇంకో శిశువు పడిపోయి, దెబ్బ తగిలిన దృశ్యం చూస్తే తన ముఖాన్ని తల్లి ఒళ్ళో కప్పెట్టుకుంటుంది.

14 నెలల వయస్సు వచ్చేప్పటికి శిశువు తన వ్యక్తిత్వాన్ని ప్రకటించడం మొదలుపెడుతుంది. అప్పుడు ఇంకో శిశువుకు దెబ్బతగిలిన దృశ్యం చూస్తే మొదటిసారిగా ఆ శిశువును ఓదార్చడానికి ప్రయత్నిస్తుంది. అప్పటికీ తనకీ, ఇతరులకీ మధ్య సరిహద్దులు స్పష్టంగా వుండవు. ఓదార్చడమంటే ఆ చిన్న పిల్ల దెబ్బ తగిలిన పిల్లలను తన తల్లి దగ్గరికి తీసుకువెళ్ళవచ్చు.

రెండు సంవత్సరాల వయస్సు వచ్చేటప్పటికి, శిశువు మూడో దశను చేరుకుంటుంది. తనకు, ఇతరులకు మధ్య వ్యత్యాసాన్ని గుర్తిస్తుంది. కాని బాల్యంలో చివరి దశ వస్తే గాని ఆ వ్యక్తి ప్రదర్శించే ఎంపతి మనం గుర్తించే స్థాయికి చేరుకోదు. ఎదుటి మనిషి మనోభావాలు ఎలా వున్నాయో వాటికి ప్రతిస్పందన చూపలేదు. కాని రెండో వ్యక్తి పరిస్థితిని గురించి తను అర్థం చేసుకున్నంత వరకు తను ప్రతిస్పందిస్తుంది. అంటే ఎదుటి వారి మానసిక వుద్రేకాలను పూర్తిగా అవగతం చేసుకునే శక్తి ఉండదు.

ఉదాహరణకు మనం ఒక శిశువు హాయిగా ఆడుకుంటూ వుండడం చూసామనుకోండి, కాని ఆ శిశువు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోందని, త్వరలోనే చనిపోతుందని మనకి తెలుసు. అందువల్ల మనం ఆ దృశ్యం చూసి ఆనందించం, అదే మరొక శిశువు ఆ దృశ్యాన్ని చూసి, ఆ పిల్లతో పాటు తానుకూడా ఆనందం అనుభవిస్తుంది.

కాన్సాస్ స్టేట్ యూనివర్సిటీలో మనోవిజ్ఞాన ప్రొఫెసరైన డా. మార్క్ ఎ. బార్నెట్ ప్రతిపాదన ప్రకారం ఇతరుల కోసం శ్రద్ధ వహించడం, తనను గురించి తనకు మంచి అవగాహన వున్నప్పుడే ప్రారంభమవుతుంది. తమను తాము అద్దంలో గుర్తించుకో గల శక్తి వున్న తెలివైన జంతువులు మాత్రమే ఇతర జంతువుల పరిస్థితిని అర్థం చేసుకోగలవని జీవశాస్త్రజ్ఞులు భావిస్తారు. అలాగే శిశువు తనను గురించి తాను గుర్తించగలిగినప్పుడే ఇతరుల భావాలకు ప్రతిస్పందించగలదు.

శిశువు తన మానసిక వుద్రేకాలు సంతృప్తి చెందినప్పుడే ఇతరుల మనోభావాలకు స్పందిస్తుంది. తనకే భద్రత లేని శిశువు ఇతరుల ఇబ్బందులను గురించి ఏం పట్టించుకుంటుంది? అందుకని బాల్యంలో కష్టాలకు లోనైన పిల్లలు, ఇతర పిల్లల కష్టాలకు స్పందించరు. తల్లిదండ్రులు ఇతరుల కష్టసుఖాలకు స్పందిస్తే, పిల్లలు కూడా అదే లక్షణం అలవరచుకుంటారు.

—ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి